సాక్షి
సిద్దిపేట
బుధవారం ၊ 2 ၊ ఏప్రిల్ ၊ 2025



రైతుల కన్నీటి కష్టాలు
భూగర్భ జలాలు అడుగంటడంతో అన్నదాతలు పంటలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వివరాలు 8లో ▸



ట్రైన్‌లో వస్తాడు.. దోచుకెళ్తాడు
జల్సాలకు అలవాటుపడిన అంతర్రాష్ట్ర దొంగను సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
వివరాలు 8లో ▸



అధికారుల అండతోనే..
రెవెన్యూ, పోలీసుల అండతోనే ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ఆరోపించారు. వివరాలు 9లో ▸

సన్న బియ్యం.. సంబురం

లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

- మొదటిరోజు ఉమ్మడి మెదక్ జిల్లాలో 801 టన్నుల బియ్యం పంపిణీ
- 38వేలకుపైగా కార్డుదారులకు అందజేత
- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు



సిద్దిపేటలోని రేషన్ షాపు ఎదుట బారులు తీరిన కార్డుదారులు



హుస్నాబాద్‌లోని రేషన్ షాపు ఎదుట లబ్ధిదారులు



బియ్యం తీసుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళ

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. రేషన్‌కార్డు దారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ షాప్‌ల వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 8,83,883 రేషన్ కార్డులుండగా మొదటి రోజు మంగళవారం 694 రేషన్ షాపులలో 38,526 కార్డుదారులకు 801.134 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. హుస్నాబాద్‌లో సన్నబియ్యం పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు.

మొదటి రోజు పంపిణీ వివరాలు

జిల్లా	మండలాలు	రేషన్ షాపులు	కార్డులు	కిలోలు
మెదక్	3	06	86	1,960
సిద్దిపేట	25	365	17,933	3,62,138
సంగారెడ్డి	27	323	20,502	4,37,036

అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లాలో మొదటి రోజు అత్యధికంగా రేషన్ కార్డుదారులు సన్న బియ్యం తీసుకున్నారు. అత్యల్పంగా మెదక్ జిల్లాలో పంపిణీ చేశారు. నార్సింగి, టెక్మాల్, పాపన్నపేట మండలాల్లో రెండు రేషన్‌షాపుల చొప్పున 6 రేషన్ షాపులలో మాత్రమే బియ్యం పంపిణీ చేయడం గమనార్హం. మరి కొన్ని రేషన్ షాపులలో బియ్యం చేరుకోవాల్సి ఉంది. అలాగే కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తామని పంపిణీని వాయిదా వేశారు.

కార్డుదారుల్లో సంతోషం..

కొన్నేళ్లుగా రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేసింది. దీంతో కార్డుదారులు అంతంత మాత్రంగానే తీసుకునేందుకు మొగ్గచూపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలవాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని అందజేస్తోంది. కార్డుదారులు సంతోషంగా సన్న బియ్యం తీసుకున్నారు. సన్న బియ్యం ఇస్తుండటంతో బయట కొనడం ఇక తప్పిందని.. అలాగే డబ్బులు కూడా మిగులుతాయని కార్డు దారులు ఆనందం వ్యక్తం చేశారు.

చరిత్రాత్మకం: మంత్రి పొన్నం



సన్న బియ్యం పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ మనుచౌదరి తదితరులు

హుస్నాబాద్: దేశంలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభించడం చరిత్రాత్మకమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో తెల్లరేషన్ కార్డుల దారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17,263 చౌక ధరల దుకాణాల ద్వారా 2.91 లక్షల రేషన్ కార్డులదారులకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఇంటికి చేరే ముందే వేరే వాళ్ళకు అమ్మడం, రేషన్ దుకాణాలకు వాపస్ ఇవ్వడం జరిగేదన్నారు. ఇక నుంచి సన్న బియ్యం అందరూ తీసుకుంటారన్నారు. అందరికీ ఆరోగ్యం బాగుండాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సౌకర్యాలు కలగజేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం సన్న బియ్యం పథకం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గజ్వేల్‌రూరల్: సన్నబియ్యం పంపిణీతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. గతంలో సరఫరా అయిన దొడ్డు బియ్యాన్ని తినకపోవడంతో అవి పక్కదారి పట్టేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెట్టి, పేద ప్రజల కడుపు నింపే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సింగారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

బీపీటీ లెక్కనే ఉన్నాయి



మా ఇంట్లో నలుగురం ఉంటే 24 కిలోలు వచ్చాయి. మా పొలంలో పండిన బీపీటీ బియ్యం లెక్కనే ఉన్నాయి. సన్న బియ్యం ప్రభుత్వం ఇస్తే బయట కొనుడు తప్పుడంతో పాటు నెలకు సుమారు రూ.1000 మాకు మిగిలినట్లే. ప్రభుత్వ నిర్ణయం బాగుంది.

– పంతంగి మునిద్ర, గాంధీనగర్

మాలాంటి గరీబోళ్లకు మేలు



ఇది వరకు సర్కార్ ఇచ్చే దొడ్డు బియ్యమే తినేవాళ్ళం. అవసరమైనప్పుడు బయట రూ.50లకు కిలో చొప్పున సన్న బియ్యం కొనేవాళ్ళం. ఇప్పుడు రేషన్ షాపులో సన్న బియ్యం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇలా ప్రతి నెలా ఇచ్చి మాలాంటి గరీబోళ్లను ఆదుకోవాలి.

–పాసికంటి సత్తవ్వ, సిద్దిపేట

గతంలో ముక్కిన బియ్యం ఇచ్చేవారు



ప్రభుత్వం రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. గతంలో దొడ్డు బియ్యం, ముక్కిన బియ్యం ఇచ్చేవారు. చాలామంది బియ్యం తీసుకునేవారు కాదు. కొందరు బయట అమ్మేవారు. ఇప్పుడు ఇచ్చిన సన్న బియ్యం అందరూ వినియోగించుకుంటారు.

– సూరగోని గౌరవ్వ, చిన్నకోడూరు

ఇన్నేళ్లలో ఇదే మొదటి సారి



ఇన్నేళ్లలో సన్న బియ్యం ఎప్పుడూ రాలేదు. 40 ఏళ్లలో సన్న బియ్యం రేషన్ షాప్‌లకు రావడం మొదటిసారి. పేదల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం. వీటితో పాటు గతంలో ఇచ్చినట్లు 9రకాల వస్తువులు ఇస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– చింతకింది వెంకటేశం, రేషన్ డీలర్, బెజ్జంకి

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా జడ్జి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతిరెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం చింతమడకలోని మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే నిరంతరం కష్టపడాలన్నారు. అనంతరం ఎస్ఐ అపూర్వరెడ్డి మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో హక్కులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత, అడ్వకేట్ అరవింద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పెద్దపీట

సిద్దిపేటకమాన్: మహిళలు, చిన్నారుల రక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని షీటీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బంది గత నెలలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గత నెలలో 48మంది ఈవ్‌టీజర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. ఎవరైనా పోకిరీలు వేధించినా, వెంటపడినా డయల్ 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 87126 67434కు సమాచారం అందించాలన్నారు.

అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిశా..

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరిన వెంటనే సీఎం స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపానన్నారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్, రింగ్ రోడ్డుతో పాటు పలు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. నాకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని, రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్ అడుగుజాడల్లోనే ముందుకు నడుస్తానని ఆయన అన్నారు.

చక్రధర శర్మకు సన్మానం



చక్రధరశర్మ దంపతులను సన్మానిస్తున్న వీరశైవ లింగాయత్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: గౌరీభట్ల చక్రధరశర్మను వీరశైవ లింగాయత్ సమాజం మంగళవారం సన్మానించింది. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను అందించింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన గౌరీభట్ల చక్రధరశర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రిమ్మనగూడకు చెందిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం సభ్యులు చక్రధరశర్మ దంపతులకు శాలువా కప్పి సన్మానించారు.

'యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు సూచించారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. 14 వరకు గడువు పొడగించారని; ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, అరుణ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములు కాపాడండి

సీపీఎం జిల్లా నేత వెంకట్‌మావో

చేర్యాల(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/మద్దూరు (హుస్నాబాద్): హెచ్‌సీయూ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసన కార్యక్రమాల సందర్భంగా మంగళవారం పలువురు ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. యూనివర్సిటీ భూములను అమ్ముకొనే చర్యను వెంటనే మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నాగరాజు, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, కుమార్ తదితరులున్నారు. అదే విధంగా బెజ్జంకిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సాయికృష్ణ, అధ్యక్షుడు మహేశ్‌ను అరెస్టు చేశారు. మద్దూరు, దూళ్మిట్ట మండలాల సీపీఎం కార్యదర్శులు ఎండీ షఫీ, రాజును పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.



పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

విగ్రహం తొలగించడం సరికాదు

సిద్దిపేటకమాన్: ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇది సరికాదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో 16ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విగ్రహాన్ని తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఐదు గ్రామాలకు కూడలి వద్ద ఉన్న విగ్రహాన్ని తొలగించకుండా అక్కడ ఒక సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, యాదగిరి, రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అవిలయ్య

కేతకీలో కర్ణాటక ఎమ్మెల్సీల పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో కర్ణాటక మాజీమంత్రి రాజశేఖర్ పాటిల్, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ పాటిల్, భీమ్‌రావు పాటిల్ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాజీ మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, నాయకులు చంద్రశేఖర్ పాటిల్, మల్లయ్య స్వామి, రుద్రయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ పాటిల్, భీమ్‌రావు పాటిల్ తదితరులు

నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై చర్యలేవీ?

సీపీఎం జిల్లా నేత ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్లయ్య మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో ఆర్ఎంఓ డాక్టర్ రాముకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలు దాటినా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చికిత్స కోసం వచ్చేవారికి వైద్యం అందించకుండా ఫోన్‌లు చూస్తూ కాలయాపన చేస్తున్నారని, దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరిస్తున్నారన్నారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇందిరమ్మ డిజైన్లపై నిరుత్సాహం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు అంతగా ఉత్సాహం చూపడం లేదు. ఇళ్లను మంజూరు చేసిన రెండు నెలలు దగ్గర పడుతున్నా జిల్లాలో కనీసం 30 శాతం మంది లబ్ధిదారులు కూడా ముగ్గు పోసుకోలేదు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం సుమారు రెండు లక్షల వరకు దరఖాస్తులు రాగా, ఇందులో 1.36 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. సొంతంగా ఇంటి స్థలం ఆధారంగా ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాలుగా రూపొందించిన విషయం విదితమే. ఇందులో సొంత ఇంటి స్థలం ఉండి అర్హతలున్న వారికి ఈ ఇళ్ల నిర్మాణంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఇలా ఒక్కో మండలానికి ఒక గ్రామ పంచాయతీని ఎంపిక చేసి..ఆ గ్రామంలో ఉన్న లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేశారు. ఇలా జిల్లాలో మొదటి విడతలో 1,200 మంది లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరిలో ఈ ఇళ్లను మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు ఇందులో కేవలం 275 మంది లబ్ధిదారులే ముగ్గు పోసుకున్నారు. బేస్‌మెంట్ వరకు కట్టుకున్న లబ్ధిదారులు 21 మంది మాత్రమే కావడం గమనార్హం.

ప్రారంభమైన ఇళ్ల నిర్మాణ పనులు

- ఇప్పటివరకు ముగ్గు పోసింది.. 30 శాతం మందే
- అతి తక్కువ విస్తీర్ణంలో నిర్మించుకునే ఇళ్లపై పెదవి విరుస్తున్న లబ్ధిదారులు
- వేరే డిజైన్లలో నిర్మించుకుంటే బిల్లులు మంజూరవుతాయా అని సందిగ్ధం



వట్‌పల్లి మండలం సాయిపేటలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు (ఫైల్)

ఇవీ కారణాలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం కింద నిర్మించుకునే ఇళ్లకు సంబంధించి రెండు డిజైన్‌లను అధికారులు ప్రకటించారు. బెడ్‌రూం, హాలు, కిచెన్‌తోపాటు, టాయిలెట్ తప్పనిసరి చేశారు. కనీసం 400 చదరపు అడుగుల నుంచి అత్యధికంగా 600 చదరపు అడుగుల వరకు ఇంటిని నిర్మించుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే 400 చదరపు అడుగుల ఇంటిని నిర్మించుకుంటే ఏ మాత్రం సరిపోదనే భావనతో చాలామంది లబ్ధిదారులున్నారు. నిర్దేశించిన డిజైన్‌లోనే కట్టుకుంటే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా ఈ రెండు డిజైన్‌లు కాకుండా వేరే డిజైన్‌తో కట్టుకుంటే బిల్లులు వస్తాయా? రాదా? అనే అనుమానాలు లబ్ధిదారుల్లో ఉన్నాయి. ఇదిలాఉండగా.. ఎక్కువ విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకుంటే ఆర్థిక భారమై అప్పుల పాలు కావాల్సి వస్తుందని, దంపతులు, ఇద్దరు పిల్లలు...ఇలా నలుగురు కుటుంబసభ్యులు నివసించడానికి 500 చదరపు అడుగుల ఇల్లు సరిపోతుందని అధికారులు చెప్పుకొస్తున్నారు. అలాకాకుండా తాహతుకు మించి ఎక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ప్రారంభించి...తీరా ఆర్థిక ఇబ్బందులతో పనులు నిలిపివేస్తే ఈ ఇళ్లు మొండిగోడలకే పరిమితమవుతాయనే భావనలో అధికారులు ఉన్నారు. అలాకాకుండా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ముగ్గుపోసుకుని ఇంటి నిర్మాణం పనులను ప్రారంభించుకోవాలని అధికారులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఇళ్లు మంజూరైన ఇందిరమ్మ లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉగాది వరకు వేచి చూసిన లబ్ధిదారులు ఈ కొత్త ఏడాదిలో చాలామంది పనులు ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఒక సాధారణ కుటుంబానికి ఎంత విస్తీర్ణంలో ఇల్లు ఉండాలనే దానిపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా మంజూరైన ఇళ్ల సంఖ్యలో ఇప్పటివరకు 30 శాతంమందే ఇళ్లు ముగ్గు పోసుకున్నారు. కొన్ని ఇళ్లు బేస్‌మెంట్ వరకు కట్టుకున్నారు.

– చలపతి, ప్రాజెక్టు డైరెక్టర్, గృహ నిర్మాణశాఖ.

క్లుప్తంగా

8న పుస్తకావిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో 8న నందిని సిధారెడ్డి కథా సంపుటి బందారం కథలు పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ.. సిధారెడ్డి కవిగా సాహిత్య ప్రపంచంలో తనదైన ముద్ర వేశాడని అన్నారు. ఆయన స్వగ్రామమైన బందారంలో తన జీవిత అనుభవ సారాన్ని కథలుగా రూపొందించి బందారం కథలు పేరిట వెలువరించారని తెలిపారు. సభకు కవులు, రచయితలు, సాహిత్య కారులు, గాయకులు, కళాకారులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదగిరి, రాజిరెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పని చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



సన్న బియ్యాన్ని అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దమ్మక్కపల్లి, కొండపాక గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ పథకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ధనికులతోపాటు పేదలు కూడా కడుపు నిండా భోజనం చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతినెలా పేదలకు రేషన్ దుకాణాల్లోంచి సన్న బియ్యం పంపిణీ జరిగేలా రెవెన్యూ అధికారులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు దిలీప్ నాయక్, సుజాత, ఆర్‌ఐలు బాలకిషన్, సత్యనారాయణ, ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల శివారులో డంప్ చేసిన ఇసుకను జేసీబీతో టిప్పర్‌లో లోడ్ చేస్తుండగా మంగళవారం టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ శంకర్ రావు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేయగా ఇసుకతోపాటు జేసీబీ, టిప్పర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

గజ్వేల్‌రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వర్గల్ మండలం నాచారం గ్రామానికి చెందిన శీల సత్యనారాయణ, జ్యోతి(35) దంపతులకు 15 ఏళ్ల కిందట వివాహం జరుగగా వీరికి ముగ్గురు సంతానం. జ్యోతి సోమవారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి వైద్యం చేయించుకునేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతుకగా ఆచూకీ లభించలేదు. మంగళవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైమ్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం మేరకు.. పటాన్‌చెరువు మండలం రుద్రారం గ్రామానికి చెందిన కామినేని నర్సింలు (50) బంధువుల పెళ్లి నిమిత్తం గత నెల 27న సంగారెడ్డి పట్టణానికి భార్య, ఇద్దరు కుమారులతో కలిసి వచ్చాడు. 31న సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పట్టణంలోని కింది బజార్‌లో గల వైన్స్‌కి వెళ్లాడు. అక్కడే తాగి స్పృహ లేకుండా పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు రాత్రి 10 గంటలకు ఇంటికి తీసుకొచ్చారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎంత లేపినా లేవకపోవడంతో వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

రైతుల కన్నీటి కష్టాలు

అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండుతున్న పంటలు
- ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకొని నీటిని ఒడిసిపడుతున్న రైతులు
- ట్యాంకర్ల ద్వారా పంటలకు నీరు
- మిరుదొడ్డిలో అన్నదాతల అవస్థలు



గుంతలో నీటిని నింపుతూ..

మిరుదొడ్డి(దుబ్బాక): మునుపెన్నడూ లేని విధంగా మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. చెరువుల్లో చుక్క నీరు కానరావడం లేదు. వ్యవసాయ బావుల్లో నీటి తడులు అసలే లేవు. బోరు బావులు సైతం వట్టిపోతున్నాయి. ఆశ చావని రైతులు మరిన్ని అప్పులు చేసి బోరు బావులు తవ్వినా చుక్క నీరు రాక పోవడంతో మరింత నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. కళ్ల ముందే పంటలు ఎండు ముఖం పడుతుంటే ఏం చేయాలో తోచక రైతులు చేతులెత్తేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో నీటి తడులులేక పొట్ట దశలో వరి సాగు, ఆరుతడి పంటలు ఎండిపోయి నష్టాలను చవి చూస్తున్నారు. ఈ క్రమంలోనే మిరుదొడ్డి మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో అడుగు పెడితే చాలు సాగు నీటి కష్టాలు కళ్ల ముందు దర్శనమిస్తుంటాయి. ఏం చేయాలో పాలుపోక బొట్టు బొట్టునూ ఒడిసి పడుతూ పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. సాగు నీరు లేక కొందరు రైతులు పంటలను వదిలేయగా, కాస్త నీటితోనైనా పంటలకు దక్కించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

ట్యాంకర్లతో వరికి నీరు

పొట్ట దశలో వరి వాడుముఖం పడుతుండటంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ట్యాంకర్ల ద్వారా వరి సాగుకు నీటిని అందిస్తున్నారు. ఎంతో కొంత పోస్తున్న బోరు బావుల యజమానులతో మాట్లాడి ట్యాంకర్‌లో నీటిని నింపుకోవడానికి బేరాలు ఆడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు నీటి ట్యాంకర్‌కు రూ.1,500 చెల్లిస్తున్నారు. అయినా మండుటెండల్లో పొలం తడపడానికి ట్యాంకర్ నీరు ఏ మూలకు సరి సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల కంటే ట్యాంకర్ ద్వారా నీటిని అందించడమే మరింత ఆర్థిక భారంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇంత చేస్తే పెట్టిన పెట్టుబడులు వస్తాయోరావోనని ఆందోళన చెందుతున్నారు.



నీటి జాడలేని అంబ చెరువు

ఎండిన పంటలు

మండు వేసవిలో భూ గర్భ జలాలు అడుగంటి పోవడంతో గ్రామంలోని ప్రధాన అంబ చెరువులో చుక్క నీరు లేక ఎండిపోయింది. దీంతో చెరువు ఆయకట్టులో సాగవుతున్న వ్యవసాయ భూముల్లో ఉన్న బోర్లు వట్టిపోయాయి. ఆశ చావని రైతులు 500 ఫీట్ల బోరు డ్రిల్లింగ్ చేపట్టినా నీటి తడి కానరాక పోవడంతో ఆశ నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పంటలను వదిలేశారు. దీంతో పొట్ట దశలో ఉన్న వరి పొలాలు, ఆరుతడి పంటలు సైతం ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

బొట్టు బొట్టును ఒడిసి పట్టి

బోరు బావులు వట్టి పోవడంతో బీర, మిరప, తమాట, మిర్చి వంటి పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వచ్చీరాని నీటిని ఒడిసి పట్టాలన్న ఆలోచనతో కొందరు రైతులు గుంతలు తవ్వి నీటిని నింపడానికి శ్రీకారం చుట్టారు. 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో 5 మీటర్ల లోతుతో (ఫాం పాండ్స్) నీటి గుంతలను తవ్వకుంటున్నారు. నీటి గుంతల అడుగుతోపాటు, చుట్టూ గోడల నుంచి నీరు ఇంకి పోకుండా ఉండేందుకు పాలిథిన్ కవర్లను అమర్చుతున్నారు. ఒక్కో నీటి గుంతకు రూ.15 వేల వరకు వెచ్చిస్తున్నారు. వచ్చే కొంచెం నీటిని గుంతల్లో నింపుతున్నారు. ఆ నీటిని ఆరుతడి సాగు చేస్తున్న బీర, కాకర, మిర్చి, తమాట వంటి పంటలకు డ్రిప్ ద్వారా అందిస్తూ గట్టెక్కుతున్నారు.



నీటి గుంతతో సాగవుతున్న బీర

ట్యాంకర్ నీటితో కాపాడుతున్న



మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. రూ.90 వేలు పెట్టుబడులు పెట్టాను. బోరు బావిలో నీరు అడుగంటి పోయింది. ఎలాగైనా పంటను కాపాడుకోవడానికి ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు, వాటర్ ట్యాంకర్‌ను అద్దెకు తీసుకున్నాను. ఒక్క ట్రిప్పుకు రూ.1,500 చెల్లిస్తున్నాను. ట్యాంకర్ నీటితో పొలానికి నీరు పారిస్తున్నా సరిపోవడం లేదు. అదనంగా మరిన్ని అప్పులు చేసి వాటర్ ట్యాంకర్లతో వరికి సాగు నీటిని అందిస్తున్నా.

– తుడుం నర్సింహులు, రైతు, లక్ష్మీనగర్

టమాటా పంటను జీవాలకు వదిలిన



ఎకరం పొలంలో ఆరుతడి సాగు కింద టమాటా పంటను వేశాను. రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. మొదట్లో బోరు బావి మంచిగా నీరు పోస్తుండే. టమాటా పూత, కాత దశలో బోరు బావిలో నీటి జాడలు పడిపోయినయ్. దీంతో పంటకు సాగు నీరందక ఎండలకు మొత్తం ఎండుముఖం పట్టింది. చేసేది లేక పశువులకు, జీవాలకు టమాటా పంటను మేతకు వదిలేయాల్సి వచ్చింది.

– పోతగల్ల కనకయ్య, రైతు, లక్ష్మీనగర్

నీటి గుంతలతో గట్టెక్కుతున్నా



మల్చింగ్‌తో పాటు, పందిరి సాగు కింద రూ.90 వేలు పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో బీర సాగు చేశాను. ఆరుతడి సాగుకు సైతం నీరందక ఎకరం బీర సాగు మొత్తం ఎండిపోయింది. మిగిలిన ఎకరం బీర సాగుకు నీరందక వాడు ముఖం పట్టింది. ఎలాగైనా పంటను కాపాడుకోవడానికి రూ. 15 వేలు వెచ్చించి నీటి గుంత (ఫాం పాండ్)ను తవ్వించాను. నీరు ఇంకిపోకుండా పాలిథిన్ కవర్‌ను ఏర్పాటు చేశాను. బోరు బావిలోంచి వచ్చే కొద్ది నీటిని గుంతలో నింపుతున్నాను. సమయానుకూలంగా నీటిని అందిస్తూ ఆరుతడి పంటలను కాపాడుకుంటున్నాను.

– పిట్ల సత్యనారాయణ, రైతు, మాజీ సర్పంచ్, లక్ష్మీనగర్

కారం పొడి చల్లి.. బంగారు గొలుసు చోరీ

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో దారి దోపిడీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్కూటీపై వెళ్తున్న వారిపై గుర్తు తెలియని దుండగులు కారంపొడి చల్లి బంగారు గొలుసును లాక్కొని పరారైన ఘటన బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఆరోగ్యమ్మ జీవనోపాధికై 20 ఏళ్ల కిందట రామచంద్రాపురానికి కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చారు. భర్త 5 ఏళ్ల కిందట మృతి చెందాడు. దీంతో వంట పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. పెన్షన్ తెచ్చుకునేందుకు సోమవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరింది. బస్సు ఎక్కడం కోసం అల్లుడు సూర్యతేజ స్కూటీపై ఇంటి నుంచి లింగంపల్లికి వెళ్తుంది. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద రాగానే బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు దుండగులు వారు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టారు. కింద పడిపోయిన ఆరోగ్యమ్మ, సూర్యతేజ కళ్లల్లో దుండగులు కారం పొడి చల్లి మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పెపల్లిలో విషాదం

ఒకే రోజు గ్రామంలో ఇద్దరు యువకులు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామంలో ఒకే రోజు ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాస్(28) మన్నాపూర్ గ్రామంలో కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. దుకాణంలో పనులు చేస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే, అదే గ్రామానికి చెందిన నాగప్ప(26)కు వడ దెబ్బతగిలి రెండు రోజుల నుంచి విరేచనాలు అవుతున్నాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఒకే రోజు గ్రామంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకుంది.

పచ్చి వడ్లు అమ్మి మోసపోకండి

- రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన
- పోతారం(ఎస్)లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌రూరల్: రైతులు పచ్చి వడ్లు అమ్మి ఆర్థిక నష్టాలను కొని తెచ్చుకోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320 పొందాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంగళవారం పోతారం(ఎస్)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభమవుతున్నాయన్నారు. జిల్లాలో మొదటి కొనుగోలు కేంద్రం హుస్నాబాద్ నియోజకవర్గంలోనే ప్రారంభించామని రైతులకు కావాల్సిన గన్నీ బ్యాగులను అధికారులు సమకూర్చుతారని చెప్పారు. జిల్లాలో 419 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా అందులో 212 ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సోలార్ ప్లాట్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు నిర్వహణ మహిళ సంఘాలకే ఇస్తే ఆర్థిక ప్రగతి సాధిస్తారన్నారు. ధాన్యం రవాణకు ఇబ్బందులు లేకుండా గుత్తేదారులతో మాట్లాడి లారీలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని, తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకోని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రాంమూర్తి, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాన్న కల నెరవేర్చాను

సాక్షితో గ్రూప్1 ర్యాంకర్ నిఖిత



చేగుంట(తూప్రాన్): గ్రూప్1లో స్టేట్ ర్యాంకు సాధించి తన తండ్రి కల నెరవేర్చినట్లు ఏరెడ్ల నిఖిత పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు మల్టీజోన్‌లో 2వ ర్యాంకు సాధించిన ఉమ్మడి మెదక్ జిల్లా హత్నూర మండలం కొడిప్యాకకు చెందిన ఏరెడ్ల నిఖిత మంగళవారం సాక్షితో మాట్లాడారు. గతంలోనే ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడలిస్టుగా మంచి ప్లేస్‌మెంట్ వచ్చినా వెళ్లలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తన తండ్రి సుధాకర్‌రెడ్డి కల మేరకు సివిల్స్‌పై ఆసక్తి పెంచుకొని ఇంటర్వ్యూలో పాల్గొన్నానని, మరోసారి ప్రయత్నం చేసి సివిల్స్ సాధిస్తానని పేర్కొన్నారు. ఇటీవల గ్రూప్ 2లో 144, గ్రూప్ 3లో 372వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఏడాదిన్నర చదివిన చదువుకు తగిన ఫలితం రావడం ఆనందంగా ఉందన్నారు. పట్టుదలతో చదువుకుంటే ఎలాంటి కోచింగ్ అవసరం లేకుండా గ్రూప్స్‌తో పాటు అన్ని పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునన్నారు.

దొంగ చేతికి తాళం

- కేంద్ర గిడ్డంగుల సంస్థ నుంచి 35 క్వింటాళ్ల బియ్యం అమ్మకం
- మెదక్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి
- కేసు నమోదు చేసిన పోలీసులు



మెదక్‌లోని కేంద్రం గిడ్డంగుల సంస్థ

మెదక్‌జోన్ : దొంగ చేతికి తాళం అప్పగించినట్లు ఉంది కేంద్ర గిడ్డంగుల సంస్థలో పని చేసే ఓ అధికారి తీరు. వరుస సెలవులతో ఎవరూ గుర్తించరని భావించిన సదరు ఉద్యోగి గోదాములో నిల్వ ఉంచిన బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించిన ఘటన మెదక్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా కేంద్రంలో కేంద్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాములు ఉన్నాయి. అందులో వేలిది క్వింటాళ్ల ఎఫ్‌సీఐ బియ్యం నిల్వ ఉంచారు. వరుస సెలవుల నేపథ్యంలో గతనెల 31న రాత్రి ఎవరూ లేని సమయంలో ఓ డీసీఎం వ్యాన్‌లో 35 క్వింటాళ్ల బియ్యం నింపి దానిని కలెక్టరేట్ వైపు తీసుకెళ్తుండగా కలెక్టరేట్ అటెండర్లతోపాటు ఆ ప్రాంత ప్రజలు గమనించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు డీసీఎంను వెంబడించి డ్రైవర్‌ను పట్టుకున్నారు. కార్యాలయంలోని ఓ అధికారి తనకు విక్రయించినట్లు చెప్పారు. ఈ విషయంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విషయంపై గిడ్డంగుల సంస్థ మేనేజర్ కోటేశ్వరరావును వివరణ కోరగా పొంతన లేని మాటలు చెబుతున్నాడు.

కూతురితో కలిసి బండి పూజకు వెళ్తుండగా..

- స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- యువతి మృతి, తండ్రికి గాయాలు
- అమీన్‌పూర్‌లో విషాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్‌కు చెందిన శ్రీశైలం కొత్త అశోక్ లేలాండ్ వాహనాన్ని సోమవారం కొనుగోలు చేశాడు. నూతన వాహనానికి పూజ చేయించేందుకు అదే రోజు సాయంత్రం ఎంబీఏ చదువుతున్న తన కుమార్తె శిరీష(22)తో కలిసి లింగంపల్లి చౌరస్తా సమీపంలోని గండమ్మ ఆలయానికి స్కూటీపై బయలుదేరారు. అశోక్ లేలాండ్ వాహనాన్ని ముందే వారేవాళ్లు ఆలయానికి తీసుకెళ్లారు. రామచంద్రాపురం పట్టణంలోని మయూరినగర్ జాతీయ రహదారిపై వెళ్తున్న వీరి స్కూటీని పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శిరీషకు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. శ్రీశైలం గాయాలపాలయ్యాడు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ భూములు కాపాడుకోవాలి

సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి



మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో అన్యాక్రాంతం అవుతున్న స్వామి వారి భూములను కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సీపీఎం పార్టీతో కలిసి రావాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 201, 208, 230లో 5 ఎకరాల 19 గుంటల భూమిని మహదేవుని మల్లయ్య, మహదేవుని సాంబయ్య 1983లో, సర్వే నంబర్ 218, 219లో 5 ఎకరాల 20 గుంటల భూమిని 1992లో మహదేవుని నాగమల్లయ్యతోపాటు మరో ఆరుగురు ఆలయానికి భూమిని విక్రయించారని తెలిపారు. ఆలయ భూములను కాపాడటంలో గతంలో ఆలయ ఈవోగా పని చేసిన బాలాజీ శర్మ నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ఆలయ భూములను కాపాడేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు కోర్టుకు హాజరు కాకుండా భూములు కొల్లగొట్టేందుకు యత్నిస్తున్న వక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఆలయ భూములు కోల్పోయే విధంగా దేవాదాయ శాఖ అధికారులు కేసుకు హాజరు కాకుండా, వాదనలు వినిపించకుండా సదరు వ్యక్తులు కట్టడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్, జిల్లాకమిటీ సభ్యులు బద్దిపడిగే కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, బక్కెల్లి బాల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి



రఘునాథ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బేలియా గ్రామానికి చెందిన రఘునాథ్ సింగ్ (21) మనోహరాబాద్ మండలం కొండాపూర్ శివారులోని శ్రీయాన్ పాలిమర్స్ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం పరిశ్రమలో కూలర్‌ను సరి చేస్తున్న క్రమంలో ఇనుప స్టాండ్ వేసుకొని ఇంజక్షన్ మోల్డ్ మిషన్‌ను పరిశీలిస్తున్నాడు. స్టాండ్‌కు విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడంతో పడిపోయాడు. ఇది గమనించిన తోటి కార్మికులు మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పరిశ్రమలో సరైన వసతులు లేకనే మృతి చెందాడని తోటి కార్మికులు పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి వచ్చి కార్మికులతో మాట్లాడి సముదాయించాడు. మృతుడి అన్న దినేశ్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రైన్‌లో వస్తాడు.. దోచుకొని వెళ్తాడు

- సిద్దిపేట వైన్స్‌లో రూ.30 వేలు, మద్యం సీసాలు దొంగతనం
- జల్సాలకు అలవాటు పడి నిత్యం చోరీలు
- పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ



వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సికింద్రాబాద్‌కు ట్రైన్‌లో వచ్చి దొంగతనాలు

సిద్దిపేటఅర్బన్: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన గుర్రం అఖిల్ అలియాస్ తాడిశెట్టి మణికంఠ (32) 11 ఏళ్ల వయస్సు నుంచే దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గత నెల 29న సిద్దిపేటలోని పొన్నాల వై జంక్షన్ వద్ద గల వైన్స్ పైకప్పు రేకులను తొలగించి రూ.30 వేల నగదు, రెండు మద్యం సీసాలను దొంగిలించాడు. చోరీ ఘటనపై వైన్స్ యజమానులు త్రీటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చంద్రయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది యాదగిరి, ప్రవీణ్, శివ, నగేశ్ ప్రత్యేక బృందంగా ఏర్పడి వెతుకుతున్నారు. సోమవారం సాయంత్రం పొన్నాల వై జంక్షన్ వద్ద హైదరాబాద్ బస్సు కోసం వేచి ఉన్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారించగా వైన్స్‌లో దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. ఇదిలా ఉండగా నిందితుడు 2012లో ఏపీలోని హండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో పట్టుబడి బాల నేరస్తుడిగా శిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలై 2021లో తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసి పట్టుబడి రాజమండ్రి సెంట్రల్ జైలుకి వెళ్లాడు. మళ్లీ జైలు నుంచి విడుదలై 2025 జనవరిలో సికింద్రాబాద్‌కు ట్రైన్‌లో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెయింట్ షాపులో ల్యాప్‌టాప్, మొబైల్, కొంత నగదు దొంగతనం చేసి, ఆ వస్తువులను అమ్మగా వచ్చిన డబ్బులతో ఇంటికి వెళ్లిపోయాడు. మళ్లీ డబ్బులు అయిపోగానే సికింద్రాబాద్‌కు ట్రైన్‌లో వచ్చి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో హార్డ్‌వేర్ షాపులో ట్యాబ్, కౌంటర్‌లోని నగదు, మొబైల్ దొంగిలించి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. డబ్బులు అయిపోగా మళ్లీ గత నెల 29న సికింద్రాబాద్‌కు ట్రైన్‌లో వచ్చి అక్కడి నుంచి సిద్దిపేటకు వచ్చి వైన్‌షాపులో దొంగతనం చేశాడు. జల్సాలకు డబ్బులు లేని సమయంలో ఇలా ట్రైన్ ఎక్కి సికింద్రాబాద్ వచ్చి పరిసర ప్రాంతాల్లో దొంగతనం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు.